క్లుప్తంగా

కొంగల ట్యాంకు గట్టు పటిష్టతకు చర్యలు



గట్టు పటిష్టత చర్యలు చేపడుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలోని కొంగలట్యాంక్ గట్టు పటిష్టత చర్యలను ఆదివారం చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గట్టు కోతకు గురై ధ్వంసమైంది. ఈనెల 6వ తేదీన కొంగల ట్యాంక్ గట్టు ప్రాంతాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి పరిశీలించి చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జేసీబీ సహాయంతో చర్యలు చేపట్టినట్లు ఇరిగేషన్ డీఈ రాంబాబు తెలిపారు.

ఓటర్ వెరిఫికేషన్‌ను సద్వినియోగం చేసుకోండి

కొయ్యలగూడెం: ప్రభుత్వం కల్పిస్తున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.చెల్లన్న దొర పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ డివిజన్ షెడ్యూలు విడుదల చేశారన్నారు. ఈనెల 10వ తేదీ వరకు అధికారులు, సిబ్బంది డోర్ టు డోర్ వచ్చి వెరిఫికేషన్ నిర్వహిస్తారని, చేర్పులు మార్పులు ఇతర సమస్యల గురించి ఓటర్లు వారితో ముఖాముఖిగా చర్చించవచ్చునని అన్నారు.

పారిజాతగిరిలో చవితి వేడుకలు



శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో చవితి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరిలో శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆలయం దిగువన మెట్టల మార్గంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. సిద్ధి వినాయకునికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు పూజాధికాలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణ ఇలవేల్పు శ్రీ నూకాలమ్మ అమ్మవారి దివ్య సన్నిధిలో, శ్రీ పంచభూత మరకత లింగేశ్వర సహిత శ్రీ చక్ర సమన్విత శ్రీ విజయ దుర్గమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న సహాయ పునరావాస కార్యక్రమాలు



బోట్ ద్వారా కూరగాయలు పంపించేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

వేలేరుపాడు: గోదావరి వరదల నేపథ్యంలో జిల్లాలో సహాయ పునరావస కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, డ్వామా పీడీ ఏ.రాము తెలిపారు. ఎప్పటికప్పుడు సహాయ చర్యలపై కలెక్టర్ ఇస్తున్న ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారు. మండలంలోని కోయిదా, కట్కూరు గ్రామపంచాయతీలకు చెందిన 943 కుటుంబాలకు శనివారం ఐదు రకాల 3,270 కిలోల కూరగాయలు పంపిణీకి ఏర్పాటు చేశామన్నారు. వీటిని పెద్దవాగు బోట్ పాయింట్ నుంచి పడవల ద్వారా పంపినట్లు తెలిపారు. ఒక్కొక్క కుటుంబానికి కేజీ ఉల్లిపాయలు, పావు కిలో మిర్చి, అర కిలో బీరకాయలు, కేజీ దోసకాయలు, అరకేజీ టమాటాలు చొప్పున అందజేసినట్లు చెప్పారు.

వసతి గృహాలను పరిశీలించిన న్యాయమూర్తులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

జంగారెడ్డిగూడెం: న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెంలోని వసతి గృహాలను న్యాయమూర్తులు పరిశీలించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల, బాలుర వసతి గృహాలను మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కేఎస్ఆర్ తేజస్వి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్వహణ, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, వంటశాలలను పరిశీలించారు. జనరేటర్ సౌకర్యం, ప్రతిరోజు అమలు జరిగే మెనూలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇతర రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయేమో అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఎస్సై జబీర్ పాల్గొన్నారు.

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంట్లు మేమయ్య

అట్టహాసంగా ప్రారంభమైన గణేష్ నవరాత్రులు

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రధాన కూడళ్లల్లో గణనాథుని భారీ విగ్రహాలను నెలకొల్పారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల క్షేత్రంలో ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురం ఆలయం వద్ద గణేష్ విగ్రహాలకు ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు, యువకులు భారీ ర్యాలీలు, బాణాసంచా కాల్పులు, ఊరేగింపులతో విగ్రహాలను తీసుకెళ్లి మందిరాల్లో నెలకొల్పారు. చెరువు వీధిలో కొలువైన గణేషునికి గ్రామ మాజీ సర్పంచ్ మల్లిపెద్ది వెంకటేశ్వరరావు పూజాధికాలను నిర్వహించారు. అలాగే క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో కొలువైన గణేషునికి సైతం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ద్వారకాతిరుమల, తిమ్మాపురం, గొల్లగూడెం, తిరుమలంపాలెం, పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గొడుగుపేట, ఐఎస్.రాఘవాపురం, నారాయణపురం, రామన్నగూడెం ఇలా ప్రతి గ్రామంలోను ఈ వేడుకలు వైభవంగా జరిగాయి.

అంగరంగ వైభవంగా గణేష్ ఉత్సవాలు

కొయ్యలగూడెం: వినాయక చవితి పురస్కరించుకొని శనివారం కొయ్యలగూడెం మండల పరిధిలో 83 చోట్ల గణేష్ ఉత్సవ శిబిరాలను నిర్వహించారు. కొయ్యలగూడెం పట్టణ పరిధిలో 15 చోట్ల గణనాథుల శిబిరాలు వెలిశాయి. మండలంలోనే అతిపెద్దదైన 15 అడుగుల అత్యంత భారీ గణనాథుని విగ్రహానికి టెంపుల్స్ సెంటర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి కోఆపరేటివ్ బ్యాంకు వీధిలో నెలకొల్పారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా పలుచోట్ల శిబిరాలకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హాజరై పూజలు నిర్వహించారు. బుట్టాయిగూడెం మండలం దుద్దుకూరులో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ శిబిరంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం రామాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడు



ద్వారకాతిరుమల: ఎస్సీ కాలనీలోని రామాలయం వద్దకు గణేష్ విగ్రహాన్ని తీసుకువెళ్తున్న దృశ్యం



బుట్టాయిగూడెం: దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే బాలరాజు పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. చలువ పందిళ్లలో వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామివారి క్షేత్రంలో స్వామి వారి ప్రతిమను ఏర్పాటు చేసి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు పాల్గొన్నారు. గురవాయిగూడెం రామాలయంలో గణనాథుడి ప్రతిమను నెలకొల్పి ఉత్సవాలను ప్రారంభించారు. గరికతో ప్రత్యేకంగా అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు.

పోలవరం రూరల్: పోలవరం మండలంలో వినాయక చవితి మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. వాడవాడలా వినాయకుని ప్రతిమలను నెలకొల్పి భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 9 రోజుల పాటు రెండు పూటలా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పోలవరంలోని జగన్నాథపేటలో గల వినాయకుని ఆలయం వద్ద విగ్రహాన్ని నెలకొల్పి పూజా కార్యక్రమాలు చేస్తున్నారు.



కొయ్యలగూడెం: మండలంలోని అతిపెద్ద భారీ గణనాథుని విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు



పోలవరం: పోలవరంలో నెలకొల్పిన గణనాథుడు



జంగారెడ్డిగూడెం రూరల్: మద్దిక్షేత్రంలో గణనాథుడికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ఆందోళన



రాజవరంలో అధ్వానంగా ఉన్న రోడ్ల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ప్రజలు

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధి చేయాలని, పక్కా డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలోని చంద్ర రాజేశ్వరరావు కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏళ్ల తరబడి ఈ గ్రామంలోని సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వాలు శ్రద్ధ వహించడం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి సీసీ రహదారులు, డ్రెయినేజీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి రేల నరసింహారావు, యర్రావుల గాంధీ, బొట్ట సుబ్బారావు, లక్ష్మీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట డ్రమ్ములు

కుక్కునూరు: శ్రీధరవేలేరు శివారులో మామిడి తోటలో సారా తయారీ కేంద్రంపై కుక్కునూరు సీఐ ఎం రమేష్‌బాబు, ఎస్సై రామకృష్ణ ఇతర సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

ప్రమాదకరంగా రహదారి



గొల్లగూడెం సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డు

కామవరపుకోట: ఉప్పలపాడు, గొల్లగూడెం సమీపంలో శనివారం రాత్రి వరద నీటికి జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి కొంతమేర కొట్టుకుపోయింది. దీంతో వాహన రాకపోకలకు కొంత సమయం అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వరద నీటిని పక్కకు మళ్లించే చర్యలను అధికారులు చేపట్టారు. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయని, వెంటనే రహదారి మరమ్మతును చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జూదరుల అరెస్టు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని చక్రదేవరపల్లిలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 8 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.19 వేల నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భాస్కరరావు చెప్పారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.2 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఇద్దరు భక్తులు ఆదివారం వేరువేరుగా రూ:2,02,317 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన కొండేటి వీరవెంకట సూర్యకుమారి రూ:1,01,201 ఆలయ కార్యాలయంలో జమచేయగా దాతకు ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. అలాగే ఏలూరుకు చెందిన రాయప్రోలు వెంకట రామ వినయ కౌశిక్ రూ: 1,01,116 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేయగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ట్రస్టుకు విరాళం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ. 27 వేలను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన సేనం శ్రీకాంత్ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వరద బాధితులకు అండగా మేము సైతం..



విజయవాడలో నిత్యావసర సరుకులు, వాటర్ బాటిల్స్‌ను అందజేస్తున్న దృశ్యం



చింతలపూడి: రూ.1.35 లక్షల విరాళం అందజేస్తున్న ముస్లిం సోదరులు



విజయవాడలో విరాళం చెక్కును సీఎం చంద్రబాబుకి అందజేస్తున్న శ్రీనివాసరావు

ద్వారకాతిరుమల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పీఎంజె లయన్ మొగతడకల శ్రీనివాసరావు(ద్వారకాతిరుమల లయన్స్ క్లబ్ డైరెక్టర్) రూ.2 లక్షల విరాళం చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అందజేశారు. తన కుమారులు సంజీవ్, ఓంప్రకాష్ తదితరులతో కలిసి విజయవాడలో ఈ చెక్కును సీఎంకు ఆదివారం రాత్రి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, విజయవాడ నగర ఎంపీ కేశినేని చిన్ని, పాకనాటి శేషు, బాబి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల సాయం

చింతలపూడి: వరద బాధితులకు అండగా మేము సైతం అంటూ పట్టణ ముస్లింలు సాయం అందించారు. పట్టణ జామియ మస్జిద్ కమిటీ, జమాతె ఇస్లామి హింద్ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ సోదరుల నుంచి వసూలు చేసిన విరాళాల సొమ్ము రూ.లక్షా 35 వేలను ఆదివారం విజయవాడలో జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్‌కు అందచేశారు. ఈ సందర్భంగా జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి రఫీక్ మాట్లాడుతూ వరదలు తగ్గిన తరువాత కుల, మతాలకు అతీతంగా వరద బాధితుల ఇంటి అవసరాలకోసం, వైద్య ఖర్చుల నిమిత్తం ఈ సొమ్మును వినియోగిస్తామని తెలిపారు. జామియ మస్జిద్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండీ జిలాని, ఉపాధ్యక్షులు ఎండీ అక్బర్ ఆలి, జమాతె ఇస్లామి హింద్ శాఖా అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ఐవైఎం అధ్యక్షుడు ఎండీ రఫీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

కొయ్యలగూడెం: వరద బాధితుల సహాయార్థం కొయ్యలగూడెంకి చెందిన కృపా సన్నిధి చర్చి బృందం ఆదివారం విజయవాడకు తరలివెళ్లారు. పాస్టర్ పౌలన్న ఆధ్వర్యంలో విజయవాడలోని కండ్రిక సింగ్ నగర్, అంబాపురం, వాంబేనగర్ ప్రాంతవాసులకు సహాయం అందించారు. రెండువేల వాటర్ బాటిల్స్, 300 లీటర్ల పాలు, 3 వేల బిస్కెట్ ప్యాకెట్లు, రూ.వెయ్యి విలువైన నిత్యావసర సరుకులు ప్యాకింగ్ కిట్లు బాధితులకు అందజేసినట్లు చెప్పారు.

సంత చెరువు గట్టు ఆక్రమణలు తొలగించండి

కొయ్యలగూడెం: ఎర్రంపేట సంత చెరువు గట్టు ఆక్రమణకు గురవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎర్రంపేట, (ఆరిపాటి) కనకాద్రిపురం మెయిన్ రోడ్‌లో ఉన్న సంత చెరువు సమీపంలో ఆక్రమణదారులు దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల రహదారి మార్జిన్ సైతం కబ్జాకి గురి కావడంతో భారీ వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, గోపాలపురం, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన పలు గ్రామాలకు ఆక్రమణలకు గురైన రహదారే ప్రధాన ఆధారమన్నారు. గతేడాది ఆక్రమణలకు గురికాగా ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారని ఆక్రమణలు తొలగించారన్నారు. మళ్లీ ఇప్పుడు ఆక్రమణలకు గురవుతున్న విషయాన్ని సంబంధిత శాఖాధికారులకు తెలిపినా పట్టించుకోలేదని తెలిపారు. చెరువు ఆయకట్టు 50 ఎకరాలకు పైగా ఉందని, ఆక్రమించిన దుకాణాల్లో కబేళాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనివల్ల జంతు వ్యర్థాలను చెరువులో పడవేయడం వల్ల తీవ్ర దుర్గంధం కలుగుతుందని రహదారి ప్రయాణికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి ఆక్రమణలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎర్రంపేట గ్రామంలో సంత చెరువు గట్టును ఆక్రమించి షెడ్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కళాకారుడు గరికపాటి

కామవరపుకోట: ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కళాకారుడు గరికపాటి రాజారావు అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. గరికపాటి రాజారావు 61వ వర్ధంతి సందర్భంగా కామవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలో సాయన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీఎస్ రాజు ఆధ్వర్యంలో పలువురు కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా గరికపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరికపాటి రాజారావు తన రచనల ద్వారా, కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరచడంలో దిట్ట అని కృష్ణ చైతన్య కొనియాడారు. అటువంటి గరికపాటి రచనలను, ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ కళాకారులు తుమ్మ విశ్వేశ్వరరావు, పల్లె నారాయణ, శివదాసు, మంగళవాయిద్య కళాకారుడు చెడే సత్యనారాయణ, రమేషు, ఏసు పాదం, మైక్రో ఆర్టిస్ట్ శివప్రసాద్, కోలాటం గురువులు సిరికొండ సుబ్బారావు, సిరిగినేటి జగదీశ్వరిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు, సీనియర్ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, ప్రముఖ సంఘ సేవకులు షేక్ ఇబ్రహీం, వీరమల్ల మధు తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరించిన దృశ్యం

సూర్యప్రకాష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

లింగపాలెం: టీసీహెచ్ఆర్‌పాలెంకు చెందిన పొదిల సూర్యప్రకాష్ కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన సూర్యప్రకాష్ పీజీ చదువుకుని ఏలూరు ఎస్ఆర్ఐ కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడని, ఆదివారం తుమ్మగూడెం వద్ద చెరువు అలుగు పడి రోడ్డు మీద ప్రవహిస్తున్న నీటి గుంటలో అతడు జారిపడి మృతి చెందడం బాధాకరమని అన్నారు. సూర్యప్రకాష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారని చెప్పారు. సూర్యప్రకాష్ మరణంతో ఆ కుటుంబం జీవన ఆధారం కోల్పోయిందని, ఆ కుటుంబాన్ని ఆదుకొని, అతని భార్యకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

వరద తగ్గినా తేరుకోని గిరిజన గ్రామాలు



వేలేరుపాడు: 8వ రోజు కూడా నీట మునిగిన ఎద్దల వాగు వంతెన




గుండేటివాగులో తగ్గని గోదావరి వరద

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 28 అడుగులకు చేరుకున్నా ముంపు ప్రవాహం వేలేరుపాడు మండలంలో ఇంకా తగ్గలేదు. శనివారం వేలేరుపాడు నుంచి రుద్రమకోటకు వెళ్లే రహదారి రేపాకగొమ్ము, కన్నాయగుట్ట, నార్లవరం వెళ్లే రహదారులు బయటపడ్డాయి. మండలానికి దిగువన ఉన్న 18 గిరిజన గ్రామాలు 8వ రోజు కూడా జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత 8 రోజులుగా పడవ ప్రయాణమే వారికి దిక్కయ్యింది. ఆయా గ్రామాల గిరిజనులు మండల కేంద్రానికి రావాలంటే ఎద్దలవాగు వద్ద పడవపై ప్రయాణించాల్సి వస్తోంది.

వాగుల్లో తగ్గని గోదావరి వరద

కుక్కునూరు: గోదావరి వరద ప్రవాహం భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టినా మండలంలో వరద ఇంకా వాగుల్లోనే ఉంది. పైన ప్రవాహం శాంతించినప్పటికి శబరి పోటు కారణంగా మండలంలో గోదావరి వరద ప్రవాహం పైన తగ్గినంత వేగంగా మండలంలో తగ్గడంలేదు. కాగా మరలా అల్పపీడన ప్రభావంతో గోదావరి ఎగువన ఉన్న తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయనడంతో మళ్లీ గోదావరికి వరద ప్రవాహం ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మండలంలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ముసురు వీడకుండా క్రమంగా వర్షం పడుతూనే ఉండడంతో రోడ్లన్నీ బురదమయంగా తయారయ్యాయి.

నిర్వాసితులను ఆదుకోవాలని ధర్నా



వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: పోలవరం ముంపు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పాత జీవోని రద్దుచేసి కొత్త జీవో ఇచ్చి నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ డిమాండ్ చేసింది. వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు కట్నం వీరాస్వామి అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ పోలవరం ముంపు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. గతంలో రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు రూ.5 లక్షలు ఇవ్వాలని, 2022లో గోదావరి వరదలు ముంపును పరిగణలోకి తీసుకొని మండలాన్ని ఈటుగా చేసి కాంటూర్ లెవెల్స్‌తో సంబంధం లేకుండా నిర్వాసితులందరికీ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, డివిజన్ నాయకులు కారటం వీరాస్వామి, కర్ర ముత్యాలరావు, కారం సత్యవతి, పార్టీ మండల నాయకులు కాశి లక్ష్మయ్య, ఎంపీటీసీ తరుణ్ తమ్మయ్య, మేడేపల్లి పంచాయతీ సర్పంచ్ కట్టడం రాంబాబు, ఉపసర్పంచ్ మోసం రాజారావు, తోడం సీత, రాజులు తదితరులు పాల్గొన్నారు.